# కవితా కౌముది

## శవం లేచిన ఇల్లు

శ్రీధర్ చౌడారపు

బరువు మోసిన భుజాలన్నీ
విశ్రాంతి తీసుకుంటున్నాయి!
శాశ్వత విశ్రాంతి పొందిన ఓ సహజీవనాన్ని
ఏడుకట్ల సవారీపై
ఊరిబయటకు ఊరేగింపుచేసి
వేయినాల్కల అగ్ని
పల్యంకనంలో పడుకోబెట్టి
పరలోకపు బోయీల భోం భోం ల మధ్య
వినువీధుల వెంబడి విహారానికి
వెనుదిరిగిరాని పయనానికి
చివరి వీడ్కోలు చెప్పేసి
ప్రతి హృదయం నెమరేసుకొంటోంది,
మంచివో మామూలువో
ఓ గుప్పెడు జ్ఞాపకాలను!
ప్రతి కన్నూ చిందిస్తోంది కన్నీటిని
కనుల కొలుకుల్లోని చెమరింపుగానో
చిరు చిరు చుక్కలు గానో
చెంపలజారే ధారలుగానో!
ఆ ఇంటి ప్రతి మూలా రోదస్తోంది
కొంగు నోట్లో కుక్కుకుని మూగగానో
వేదనతో వెక్కిళ్ళుపెడుతూనో
గుండెలు బాదుకొని ఘొల్లుమంటూనో
గొంతునందు గరళంగా దుఃఖాన్ని దాచుకుని
కుమిలి కుమిలి పోతూనో!

పక్కనింటి పరోపకారం
పానీయాలు ఫలహారాలు పంపిణీ చేస్తోంది,
ఏళ్ళుగా వెంటనడిచిన సాన్నిహిత్యం
ఓదార్పుల బాధ్యత తీసుకుంది,
పైకండువాల పెద్దరికం
ఇల్లంతా వెతికి వెతికి
బతుకు డైరీని సంపాదించి
మంచితనం పేజీలను
బాహాటంగా చదవడం మొదలెట్టింది,
ఆ ఇంట్లో
ఒక జీవంలోని దీపం ఆరిపోయి
మట్టిలో కలిసింది,
ఆ అరుగుమీద
ఓ మట్టి ప్రమిదలో దీపం వెలిగి
జీవం కనిపిస్తోంది,
దయచేసి మౌనంగానే ఉండండి..
వీళ్ళను కరువుతీరా ఏడవనీయండి..
కడుపులోని దుఃఖం కరిగి నీరయ్యేదాకా!
దయతో ఊరడిస్తూనే ఉండండి,
స్మృతుల్లో కలిసిపోయిన బంధాన్ని
వీళ్ళు మెల్లమెల్లగా మరుపుల
మధువనంలోకి మళ్ళించేదాకా!
అమ్మా.. అయ్యా...
మీరు మౌనంగానే వెళ్ళండి
వెళ్ళొస్తానని మాత్రం, ఏమాత్రం చెప్పకండి
ఇది శవం లేచిన ఇల్లు!!

★★★

# సిగ్గుగా ఉంది..
## రాజ్ పాలెపు

మారే ఋతువులు, తరిగే జుట్టు,
పెరిగే వయసు ....
ఇలా ప్రతీ మార్పు నాకు
ప్రతిబంధకమే ......
అతి సహజమైన ఈ మార్పులన్నీ
నాకు అసహనాలే
అవసరాలకే ఆసరా లేదు ఒక నాడు
నాటి విలాసాలు కూడా దాసోహం నేడు
అయినా గతమెప్పుడూ తీపి గురుతే
భవిష్యతెప్పుడూ అభద్రమే

వచ్చి పోయిందంటూ వసంతంపై వగస్తూ
శిథిల సంకేతమంటూ శిశిరాన్ని వెలిస్తూ
భూత భవిష్యత్ కాలాల్లో పాతుకు పోయిన నాకు ....
తన జీవ కళనంతా హరించి వేస్తున్న
శిశిరాన్ని సైతం
తనువంతా అలంకరించుకుని
మరీ ఆహ్వానిస్తున్న ఈ ప్రకృతిని చూస్తే
సిగ్గుగా ఉంది!!

***



# నేను – నా ఉనికి
## వి.వి.సత్యనారాయణ రావు

బురదలో పుట్టిన తామర పువ్వును నేను
మలినమే అంటని అందాల అరవిందాన్ని
నీళ్ళలోపల తేలియాడే తామరాకును నేను
నీటి తడి అంటని నీరజ పత్రాన్ని
ముళ్ళ మధ్య పెరిగిన గులాబీ పువ్వును నేను
ముళ్ళు గుచ్చుకోని సుమధుర కుసుమాన్ని
పాషాణ శిల నుండి ప్రభవించిన నేను
పూజార్హమైన మనోహర సుందర విగ్రహాన్ని
కడలి గర్భములోన వృద్ధి చెందిన నేను
మెరిసి మురిపించు మంచి ముత్యాన్ని
ముప్పది రెండు పదును కత్తుల మధ్యన నేను
తిరుగుతూ ముద్దుగా పలుకేటి తీపి నాలుకను,
మురికి భాండము నుండి పుట్టిన నేను
ముచ్చటగా పెరిగిన ముద్దు పాపాయిని నేను
కల్లా కపటమెరుగని కనుపాపని నేను
పాపపుణ్యాలంటని పరమాత్మురాలిని...!!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎచటనుండియో చిరుగాలి యిటకు వచ్చి
పలకరించును నాదు చెంపలను తాకి
గాలి యలలపై పూవులవోలె సాగి
పరవశించు ప్రేమికుల భావముల వోలె

మరల యొకనాడు శాంతము మరచిపోయి
అలజడిగ వచ్చిచెట్ల యాకులను రాల్చు
అంతలోపల యెటులనో యలక తీరి
నెమ్మదిగ సాగునిట శాంతి నిండుకొనగ

కన్నులకు సుంతయైనను కానరాదు
గ్రాహ్యమొక్కొక మారు విఘాతశక్తి
చింత యెరుగని నిశ్చల జీవితమున
సర్వమును కదల్చెడు ప్రభంజనము తాను

చిరము సాగునే యొకరీతి జీవితమ్ము
మెరక పల్లములుండు ప్రేమికుల త్రోవ
కలసి చేకొందుమీ చిరుగాలి స్పర్శ
కలసి యనుభవింతుము పెనుగాలి ధాటి

చేరి లాలించి సేద దీర్చినను గాని
అనుపమితశక్తి హెచ్చరించినను గాని
జీవితాంతము నేస్తమై చెంతనుండు
తనువులోపల ప్రాణమై తనరుచుండు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS